క్లుప్తంగా

425 మందికి వైద్య పరీక్షలు



చల్లపల్లి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలో వైద్యరంగం బలోపేతమైందని జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు శిబిరంలో 425 మందికి వైద్య పరీక్షలు చేసి నెల రోజుల మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు రాజులపాటి శివప్రసాద్, ఎంపీడీఓ చేకుచిన రాట్నాలు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్, ఈఓ పేర్ని మాధవేంద్రరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కోసం జన ఔషధి

చల్లపల్లి: పేదలు, రైతులు, వ్యవసాయ కార్మికులకు తక్కువ ధరకే మందులు అందించడానికి జన ఔషధి కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ పాగోలు నాగ సీతారామారావు (ఫణి) తెలిపారు. స్థానిక పీఏసీఎస్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న జన ఔషధి కేంద్రం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫణి మాట్లాడుతూ ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం, ఫార్మాస్యూటికల్ మెడికల్ డివైజెస్ బ్యూరో ఆఫ్ ఇండియా చేపట్టిన కార్యక్రమం ద్వారా పీఏసీఎస్‌లో నూతన జనరిక్ మందుల దుకాణం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో 1,759 రకాల మందులు, 280 రకాల సర్జికల్ పరికరాలు 50 నుంచి 90 శాతం రాయితీపై లభిస్తాయని తెలిపారు. జిల్లాలో ఈ తరహా కేంద్రాలు ఐదు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ తోట కృష్ణారావు, పర్సన్లు వేముల ఏడుకొండలు, కొలుసు సుబ్బారావు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులపై అవగాహన కల్పించండి



పెదప్రోలు(మోపిదేవి): ఆరోగ్యశ్రీ కార్డులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆరోగ్యశ్రీ స్టేట్ నోడల్ ఆఫీసర్ ఆర్.చిత్ర అన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించి, ఆరోగ్య సిబ్బందితో రివ్యూ నిర్వహించారు. అనంతరం పెదప్రోలులో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ చేశారు. ఎంపీడీఓ కె. శ్రీనివాసరావు, వైద్యాధికారులు డాక్టర్ హారిక, డాక్టర్ అనిల్, ఎంపీహెచ్ఈవో బాబూరావు, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, పంచాయతీ కార్యదర్శి రామకోటేశ్వరావు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'గడప గడప' నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం

అన్నవరం(మోపిదేవి): వెంకటాపురం శివారు అన్నవరం గ్రామానికి 'గడప గడపకు మన ప్రభుత్వం'లో కేటాయించిన నిధులు రూ. 7.20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. సర్పంచ్ తుమ్మా సోములమ్మ సోమవారం టెంకాయ కొట్టి నిర్మాణ పనులు ప్రారంభించారు. తుమ్మా ముఖర్జీ ఇంటి నుంచి కర్రా నాంచారమ్మ ఇంటి వరకు 85 మీటర్ల మేర రూ. 5 లక్షలతో, కర్రా నాంచారమ్మ ఇంటి నుంచి తుమ్మా లీలా కృష్ణ ఇంటి వరకు 40 మీటర్ల మేర రూ. 2.20 లక్షలతో రెండు సీసీ రోడ్లు వేస్తున్నట్లు సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు సర్పంచ్ సోములమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల్లో కానుకల లెక్కింపు

మచిలీపట్నంటౌన్: స్థానిక బచ్చుపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయాల్లో నాలుగు నెలల సమయానికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపును సోమవారం నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో రూ. 3,83,592 ఆదాయం రాగా మల్లేశ్వరస్వామి ఆలయంలో 1,05,730 ఆదాయం వచ్చినట్లు ఆలయాల ఈఓ ఎస్ఎస్ చక్రధరరావు తెలిపారు. లెక్కింపును మచిలీపట్నం డివిజన్ తనిఖీ అధికారి కె.శ్రీనివాసరావు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ముక్తేవి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంకలో 21.03 శాతం కులగణన

మర్రిపాలెం(నాగాయలంక): మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 25.24 శాతం గృహాల్లో 21.03 శాతం కులగణన పూర్తైనట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మర్రిపాలెం, నంగేగడ్డ సచివాలయాల పరిధిలో కొనసాగుతున్న కులగణన పనితీరును సోమవారం ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ వెరిఫికేషన్ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో 17,055 గృహాల్లో 4,304 ఇళ్లలో 9,886మంది వివరాలు నమోదు చేశారని ఆమె వివరించారు. 298 మంది ఎన్యుమరేటర్లు, 136 మంది సచివాలయ ఉద్యోగులు, అయిదుగురు వెరిఫికేషన్ అధికారులు తదితరులు సర్వే చేస్తున్నారన్నారు.

రామనామమంత్రో పల్లెల పులకింత



కోడూరులో సీతారామచంద్రస్వామి ఊరేగింపు



శ్రీరాముని విగ్రహంతో శోభాయాత్రలో ఎమ్మెల్యే సింహాద్రి



రాముని వేషధారణలో చిన్నారితో పేర్ని కిట్టు



పెడనలో..



బందరులో భజన చేస్తున్న భక్తులు



పెదప్రోలు ఆంజనేయస్వామి ఆలయంలో ..



చల్లపల్లిలో శోభా యాత్ర



మోపిదేవి గౌడ రామాలయం వద్ద..

మచిలీపట్నంటౌన్: జై శ్రీరామ్ నినాదం నియోజకవర్గంలో మిన్నంటింది. అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సోమవారం నగరంలోని పలు రామాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యాన కోనేరుసెంటర్‌లో ఉదయం నుంచి పూజలు నిర్వహించారు. శ్రీ సాయిమల్లయ్య భజన సమాజం నిర్వహించిన భజన భక్తులను ఆకట్టుకుంది. రాత్రికి సీతారాముల కల్యాణం కనులపండువగా నిర్వహించారు. తొలుత శ్రీభద్రాద్రి రామాలయం నుంచి కోనేరుసెంటర్ వరకు స్వామివార్లు గరుడ వాహనంపై ఆశీనులు కాగా అఖండ జ్యోతులతో మహిళలు ఊరేగింపు నిర్వహించారు. జగన్నాథపురంలోని స్వామివారు పల్లకీలో కోనేరుసెంటర్‌కు చేరుకున్నారు. కార్యక్రమాలకు మునిసిపల్ మాజీ చైర్మన్లు షేక్ సలార్‌దాదా, ఎంవీ బాబాప్రసాద్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యేశ్వరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు వేముల కృష్ణ తదితరులు హాజరయ్యారు. వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నగరంలో శోభాయాత్ర నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు పాల్గొన్నారు. శోభాయాత్రలో చిన్నారి దుహిత సాయిప్రియ శ్రీరాముని వేషధారణ ఆకట్టుకుంది.

కోనేరుసెంటర్: బందరు మండలంలోని గ్రామాల్లో సోమవారం శ్రీరామనామ స్మరణలు మార్మోగాయి. పలుచోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. పోతిరెడ్డి పాలెం రామాలయంలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పోతిరెడ్డి కృష్ణకాంత్, సోడిశెట్టి బాలాజీ, రాజబాబు పాల్గొన్నారు.

అవనిగడ్డ: స్థానిక 7వ వార్డులోని కోదండరామాలయ భక్త బృందంతో సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు శ్రీరాముని విగ్రహాలతో యాత్రలో పాల్గొన్నారు. గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహ సెంటర్‌లో అభిషేకాలు చేశారు. స్థానిక శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో సోమవారం విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై అయోధ్య రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించారు. ధర్మకర్త పోతరాజు భాస్కరరావు పర్యవేక్షించగా అర్చకులు రామాచార్యులు, అప్పలాచార్యులు, నరసింహమూర్తి పూజలు చేశారు.

కోడూరు: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని వాడవాడలా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సీతారామచంద్ర స్వామివారి శోభాయాత్రను కనులపండువగా చేశారు. కోడూరులో విశ్వహిందూ పరిషత్, గీతాపారాయణ సంఘాల ఆధ్వర్యాన రామచంద్రమూర్తికి ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద నుంచి భక్తులు స్వామివార్ల విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. బైపాస్ రహదారిలో అన్నం కిషోర్ రైస్ మిల్ సమీపంలో వేదపండితుల సీతారామచంద్రుడి శాంతి కల్యాణాన్ని నయనమనోహరంగా నిర్వహించారు. మెరకగౌడపాలెం, సాలెంపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేటలో భజనలు చేశారు.

భారీ స్క్రీన్లపై..

అయోధ్యలో జరిగిన బాలరాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని భారీ స్క్రీన్ల ద్వారా పరిషత్ సభ్యులు ప్రత్యక్ష ప్రసారం చేశారు. రామచంద్రుడి విగ్రహాన్ని చూసి భక్తులు తరించారు. మధ్యాహ్నం ఎనిమిది వేల మందికి మహా అన్నసమారాధన చేశారు. వీహెచ్‌పీ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, వాసవీ క్లబ్, ఆర్య వైశ్య సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు గ్రామంలో శ్రీ మద్రామ సువర్చల సమేత ఆంజనేయ స్వామివారి ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు పెళ్లూరి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో ఐదు గురు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం చేశారు. సాయంత్రం గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు.

చల్లపల్లి: స్థానిక ఆర్యవైశ్య సంఘ భవనం నుంచి ఆర్యవైశ్య సంఘాల నాయకుల ఆధ్వర్యంలో శోభాయాత్ర ప్రారంభించారు. భారీ ర్యాలీతో శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, హనుమంతుని విగ్రహాలకు పల్లకీ ఉత్సవం నిర్వహిస్తూ రామనామ స్మరణతో ముందుకు సాగారు. అనంతరం కన్యకా పరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు చేశారు. చల్లపల్లి సీఐ సీహెచ్ నాగ ప్రసాద్, ఎస్ఐ సీహెచ్ చినబాబు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

భావదేవరపల్లి(నాగాయలంక): భావదేవరపల్లిలో భోగాదివారి ముతా పూర్వీకుల రామాలయంలో భారీ అన్నసంతర్పణ, భజనలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి. సుమారు రెండు వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ భజన మండళ్ల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సీత, రామ, హనుమత్ భజనలు చేశారు. ఆలయ ధర్మకర్త భోగాది గిరి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త పూషడపు నిరంజనరావు, మత్తి రమేష్ నాయుడు, పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

నాగాయలంక: స్థానిక జై వాసవీ సేవాదళ్, ఆర్యవైశ్యసంఘం సంయుక్త ఆధ్వర్యాన సోమవారం మండల కేంద్రం నాగాయలంకలో శ్రీరాముడి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. తొలుత శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత నగరేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలోని హనుమాన్ విగ్రహం వద్ద భక్తుల సమక్షంలో ఆలయ అర్చకుడు కొల్లిపర సుబ్బారావు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం శ్రీరాముడు, శ్రీవాసవీ మాత చిత్ర పటాలతో గ్రామంలోని అన్ని ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు భక్తులకు పానకం, వడపప్పు ప్రసాద వితరణ కార్యక్రమాన్ని స్థానిక ఎస్ఐ ఎం.సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచి మండవ బాలవర్థిరావు ప్రారంభించారు. చిన్నారులు సైతం ఉత్సాహంగా వేడుకలో పాల్గొన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ డాక్టర్ ఏవీఎల్ నారాయణ, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు చిట్టా సాంబశివరావు, మునగాల మోహనరావు, చిట్టా శివనాగేశ్వరరావు, చిట్టా శేఖర్, లేబాక నాగేశ్వరరావు, తలశిల రాము, సేవాదళ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శోభా యాత్ర పాశ్చాపురం గ్రామం నుంచి పలు దేవాలయాలు సందర్శిస్తూ బంటుమిల్లి వరకు సాగింది. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్ భక్తులతో కలిసి పాదయాత్ర చేశారు. సువర్చల మురళీ కోలాటం బృందం చేసిన కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.బంటుమిల్లి లక్ష్మీపురం సెంటర్లో భక్తులు టపాసులు కాల్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల కన్వీనరు ఇల్లూరి నాగబాబు, బీజేపీ మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు బండ్రెడ్డి ఆంజనేయులు, జల్లూరి కిరణ్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

పెడన: అయోధ్యలో బాలరాముడు విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని పెడన పట్టణంలో శ్రీరామనామ మహానగర సంకీర్తన హోరెత్తింది. పెడన– గూడూరు రోడ్డులో బ్రహ్మపురం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సీతారాముల చిత్రపటంతో భారీ ఊరేగింపుగా పెడన బస్టాండ్ సమీపంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం వరకు శ్రీరామ సంకీర్తనతో భక్తులు ర్యాలీ నిర్వహించారు. హిందూ బంధువుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన శ్రీరామ నామ మహానగర సంకీర్తన ఆద్యంతం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. పెడన ఎస్ఐ రవిచంద్రకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

గూడూరు: విశ్వహిందూ పరిషత్ గూడూరు ప్రకండ అధ్యక్షుడు తురగా ప్రసాద్ ఆధ్వర్యంలో కప్పలదొడ్డి, గూడూరు, కంకటావ, రామానుజవత్తర్లపల్లి, తరకటూరు, మద్దిపట్ల, కంచాకోడూరు, మల్లవోలు గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాలలో ఉదయం నుంచి నగర సంకీర్త పూజా కార్యక్రమాలు, సాయంత్రం దీపాలకంరణలు నిర్వహించారు. కార్యక్రమంలో అఖండ కార్యదర్శి బత్తిన రవి, అఖండ ప్రముఖులు డాక్టర్ రమణ, భావన్నారాయణ, జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: మండలంలోని మాట్లాం గ్రామంలో చిన్నారులు ర్యాలీలో పాల్గొని సందడి చేశారు.

శ్రీరాముని రూప సౌందర్యంతో సహస్ర దీపాలంకరణ శోభ

నాగాయలంక: శ్రీరామ పాదక్షేత్రం ప్రాంగణంలోని శ్రీసీతా రామచంద్రమూర్తుల ఆలయంలో సోమవారం రాత్రి శ్రీరామ రూపంలో సహస్ర దీపాలంకరణ వైభవంగా జరిగింది. క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, క్షేత్ర పాలకుడు రఘుశేఖర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



నాగాయలంక శ్రీరామ పాదక్షేత్రంలో సహస్ర దీపాలంకరణ

ఆయిల్‌పాం సాగుకు శ్రీకారం

ఘంటసాల(అవనిగడ్డ): శ్రీకాకుళంలో ఆయిల్‌పాం తోట సాగుకు శ్రీకారం చుట్టారు. ఉద్యాన శాఖ, ఉండవల్లి ఆగ్రోస్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుమలశెట్టి వీర వెంకటేశ్వరరావుకు చెందిన రైతు పొలంలో మొక్కలు నాటారు. ఉద్యానవనశాఖాధికారి జెల్లి కీర్తిదేవ్ మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగుకు కృష్ణా జిల్లా అనుకూలంగా ఉందన్నారు. ఒకసారి పంట వేస్తే 30 నుంచి 40 సంవత్సరాల వరకూ పంటను తీసుకోవచ్చని చెప్పారు.

రేపు ఆసరా చెక్కుల పంపిణీ

కృత్తివెన్ను: చినగొల్లపాలెంలో బుధవారం ఉదయం ద్వారా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో పార్టీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము, అధికారులు, ఇతర నేతలు పాల్గొంటారని పేర్కొన్నారు.

కేయూలో నేడు విద్యార్థులతో ముఖాముఖి

కోనేరుసెంటర్: ఏపీలో వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన మార్పులు, మహిళా సాధికారత దిశగా సాధించిన అడుగులుపై ఈ నెల 23న విశ్వవిద్యాలయ విద్యార్థులుతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ పి.వీర బ్రహ్మచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అకాడమిక్ బ్లాక్‌లోని అల్లూరి సీతారామరాజు ఆడిటోరియంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ముఖాముఖి జరుగుతుందని పేర్కొన్నారు.

కలెక్టరేట్ సుందరీకరణకు ప్రత్యేక చర్యలు

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్ సుందరీకరణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ రాజాబాబు అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో ల్యాండ్ స్కేప్ డెవలప్‌మెంట్‌లో భాగంగా సోమవారం సుందరీకరణకు సంబంధించి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రీనరీ అభివృద్ధికి ప్రత్యేక మొక్కలను నాటడంతో పాటు కలెక్టరేట్‌కు విచ్చేసే ప్రజలు, అధికారులకు ఆహ్లాదకరమైన వాతావరణం కలిగించడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ట్రాఫిక్ ఐల్యాండ్‌లో సత్యమేవ జయతే ప్రభుత్వ అధికార చిహ్నం స్థూపాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులు కూడా కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో పెద్ది రోజా తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో జేసీ గీతాంజలి శర్మ తదితరులు

విద్యార్థులకు పోటీలు నిర్వహించండి

పెడన ఎన్నికల అధికారి రాజ్యలక్ష్మి

పెడన: ఓటరు దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు పాఠశాల, కళాశాల స్థాయిల్లో పోటీలు నిర్వహించాలని పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి, ముడా వైస్ చైర్‌పర్సన్ కె.రాజ్యలక్ష్మి అన్నారు. ఆమె పెడన తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంఈవోలు, కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఓటరు దినోత్సవంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 25న ఓటరు దినోత్సవం కార్యక్రమాన్ని నియోజకవర్గ స్థాయిలో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. మండల స్థాయిలో 23వ తేదీ ఉదయం విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించాల్సిందిగా సూచించారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన వారిని నియోజకవర్గ స్థాయిలో హాజరయ్యేలా చూడాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో గెలుపొందిన వారు జిల్లాస్థాయిలో పాల్గొనేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత ఎంఈవోలు తీసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. ఆ రోజు సీనియర్ ఓటర్లను గౌరవించి సత్కరించే ప్రక్రియను తహసీల్దారు చేపట్టాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, గూడూరు మండలాల తహసీల్దార్లు మధుసూదనరావు, సత్యనారాయణ, గోపాలకృష్ణ, విజయప్రసాద్, ఎన్నికల డీటీ కల్ప, ఎంఈవోలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఓటరు దినోత్సవంపై తహసీల్దారు, ఎంఈవోలతో సమీక్షిస్తున్న ఎన్నికల అధికారి రాజ్యలక్ష్మి

రక్షిత మంచినీటి పథకం నుంచి స్వచ్ఛమైన తాగునీరు

కృత్తివెన్ను: వేసవిలో మెగారక్షిత మంచినీటి పథకం నుంచి ప్రజలకు పుష్కలంగా స్వచ్ఛమైన తాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని దానికి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. ఆయన సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటరమణమూర్తి, పార్టీ నాయకులతో కలసి సీతనపల్లి మెగా రక్షిత మంచినీటి స్కీంను పరిశీలించారు. దీని నుంచి నీటిసరఫరా సక్రమంగా జరగడం లేదని, సరిగా ఫిల్టర్ కావడం లేదని ఫిల్టర్ బెడ్లు పాడైన విషయాన్ని ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్ వివరించారు. నీటిని శుద్ధి చేయడానికి ముందుగా ఒక ఫిల్టర్ బెడ్‌ను ఫిబ్రవరి నెలాఖరుకు సిద్ధం చేయాలని దానికి అవసరమైన నిధులను సమకూర్చుతానని రాము తెలిపారు. కొమాళ్లపూడి, వాలంక రక్షిత స్కీంలకు మైక్రోఫిల్టర్‌ల ఏర్పాటుకు అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. తాగునీటి కొరత లేకుండా ప్రణాళిక ప్రకారం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాము సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతిరాజు, జెసీఎస్ మండల ఇన్‌చార్జ్ బాపూజీ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ నటరాజులు పాల్గొన్నారు.



సీతనపల్లి మెగాస్కీం వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఉప్పాల రాము


బంటుమిల్లి: ఎన్నికల కోడ్ రాకముందే మల్లేశ్వరం స్కీం ద్వారా గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాలని అందుకు కావలసిన నిధలు ఏర్పాటు చేస్తామని ఉప్పాల రాము అన్నారు. సోమవారం మండలంలోని తాగునీటి సమస్యపై గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం అధికారులతో కలసి మల్లేశ్వరం రక్షిత మంచినీటి పథకాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కె.గంగాధర్, వైస్ ఎంపీపీ చిన్నారిబాబు, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పి. మహేష్, ఎస్ఈ వెంకటరమణ, డీఈ నటరాజు, ఏఈ నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎస్. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో ముందుకు..

మచిలీపట్నంటౌన్: ఆర్యవైశ్యులు సేవాభావంతో ముందుకు సాగాలని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ కొత్త గణేష్‌బాబు అన్నారు. స్థానిక ఫంక్షన్ హాల్లో సోమవారం వాసవీ క్లబ్, వనితక్లబ్, కపుల్స్ క్లబ్, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. గణేష్‌బాబు మాట్లాడుతూ వాసవీక్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సభ్యులు అంకితభావంతో పని చేయాలన్నారు. వాసవీక్లబ్, వనితక్లబ్, కపుల్స్‌క్లబ్ మచిలీపట్నంశాఖల అధ్యక్షులుగా వీకేఎస్ మూర్తి, టి.అనూరాధ, యు.శ్రీనివాస్, కార్యదర్శులుగా జె.రాంబాబు, కేఎస్ఎల్ శ్రీదేవి, టి.మధుసూదనరావు, కోశాధికారులుగా జె. ప్రసాద్, టీఎస్ మల్లిక, టీఎస్ వీఎస్ ప్రసాద్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ బాబాప్రసాద్, కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కొత్తగుండు రమేష్ తదితరులు కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లను కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ శ్రీకాకోళపు రేణుకారాణి, ఇంటర్నేషనల్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ కొత్త ముక్తేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు శింగనపల్లి సురేష్, చిట్టూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యలో రాణించాలి

మచిలీపట్నంటౌన్: ఉన్నత విద్యలో రాణించేందుకు బాటలు వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కలలను విద్యార్థులు సాకారం చేయాలని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. పలు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం జగనన్న ట్యాబ్‌లను కిట్టు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారన్నారు. దీనిలో భాగంగా నాడు – నేడు ద్వారా పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ, నేతలు భగవాన్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.



ట్యాబ్‌ల పంపిణీలో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

పెడనలో మహిళా ఓటర్లు అధికం

- 1,65,770 మంది ఓటర్లు
- పురుషులు 82,245...మహిళలు 83,524
- పురుషులు కంటే మహిళలు 1,279 మంది అధికం

పెడన: నియోజకవర్గంలో 1,65,770 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం ఎన్నికల అధికారి కె.రాజ్యలక్ష్మి పెడన నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను విడుదల చేశారు. నియోజకవర్గంలోని 216 బూత్‌లలోనే కాకుండా తహసీల్దార్ల కార్యాలయాలు వద్ద కూడా ఆయా జాబితాలను ప్రదర్శనకు ఉంచారు. 'పెడన'లో 1,65,770 మంది ఓటర్లు ఉండగా వీరిలో మహిళలు అధికంగా ఉన్నారు. పురుషులు 82,245 మంది ఉంటే మహిళలు 83,524 మంది ఉన్నారు. ఇతరులు ఒకరున్నారు. పురుషులు కంటే మహిళలు 1,279 మంది అధికంగా ఉన్నారు.

మండలాల వారీగా

మండలాల వారీగా పరిశీలిస్తే గూడూరులో మొత్తం ఓటర్లు 39,823 మందిలో పురుషులు 19,731 మంది ఉండగా మహిళలు 20,091 మంది, ఇతరులు ఒకరున్నారు. పెడన రూరల్‌లో మొత్తం 27,585 మందిలో పురుషులు 13,778, మహిళలు 13,807, పెడన పట్టణంలో 24,776లో పురుషులు 12,055, మహిళలు 12,895 ఉన్నారు. బంటుమిల్లిలో 36,062 మందిలో పురుషులు 17,931, మహిళలు 18,131 మంది ఉన్నారు. కృత్తివెన్ను మండలంలో మొత్తం ఓటర్లు 37,350 మందిలో పురుషులు 18,750, మహిళలు 18,600 మంది ఉన్నారు. కృత్తివెన్ను మండలంలో మినహా మిగిలిన మూడు మండలాల్లోను మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.



నాగాయలంకలో ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న తహసీల్దార్ విమలకుమారి

మోపిదేవిలో 28,727 మంది ఓటర్లు

మోపిదేవి: మండలంలోని 38 బీఎల్వో కేంద్రాల్లో ఓటర్ల లిస్టు 28,727 మందితో సిద్ధం చేసినట్లు తహసీల్దార్ కె. నవీన్‌కుమార్ తెలిపారు. అందులో పురుషులు 14,220, స్త్రీలు14,507 మొత్తం 28,737 మంది ఓటర్లుగా నమోదైనట్లు వివరించారు.

నాగాయలంక మండలంలో ఓటర్లు 39,110 మంది

నాగాయలంక: మండలంలోని 49 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల జాబితాలను స్థానిక తహసీల్దార్ జె.విమలకుమారి మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం విడదల చేశారు. మండలంలో మొత్తం ఓటర్ల సంఖ్య 39,110 మంది. వీరిలో పురుషులు 19,707మంది, మహిళలు 19,339మంది, థర్డ్ జండర్ నలుగురు ఉన్నారు. 219 నుంచి 267 పోలింగ్ బూత్‌ల వద్ద జాబితాలను ప్రదర్శన చేసినట్లు తహసీల్దార్ చెప్పారు.